జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 9 | మే | 2025 • పేజీలు : 5



# నిరుపేదలందరికి.. సన్నబియ్యం అందించడమే మా లక్ష్యం

▪ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**భద్రాచలం ,మే 8,ప్రజాజ్యోతి :** రాష్ట్రంలో ఉన్న నిరుపేదలందరికి పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం పథకం ఉగాది నుండి ప్రారంభించడం జరిగిందని తెలంగాణ రాష్ట్రం రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు రాత్రి భద్రాచలం పట్టణం లోని అయ్యప్ప కాలనీలో నిరుపేద

మిగతా 5 లో...



# అడ్డదారులకు... ఆద్యుడు...



2 లో..

● సిరుల మాగానికి అవినీతి మకిలి అంటించిన అరాచక వాది ● సింగరేణి వ్యాప్తంగా పైరవికారుల సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన ఘనుడు ● ఆయన అవినీతిపై పోరాటం చేసి వాళ్లు ఎందరో.. ● అయినప్పటికీ ఆగని అక్రమాల దందా ● అవినీతి నిరోధక శాఖ కేసులు.. అరెస్టులు.. రిమాండ్లు.. ● అయినా వక్ర బుద్ధి వదలని ప్రబుద్ధుడు ● తప్పును ఎత్తిచూపిన వాళ్లపై దాడులు... ● ఆయన డిక్షనరీలో కాదేదీ అవినీతికి అనర్హం ● ట్రాన్స్ఫర్లు, డిప్యూటేషన్లు, క్వార్టర్ల కేటాయింపు, మెడికల్ బోర్డు దందాల్లో ఆయన ప్రమేయం ● కోల్ బెల్ట్ లో అవినీతి జలగ సంపతుడు ● మొన్నటి వరకు కొనసాగిన ముఠామేస్త్రి అక్రమాల పరంపర ● అనుచరులపై ఏసిబి దాడులతో అజ్ఞాతంలోకి .. ● **సంపతుని అక్రమ అందలంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.**

## రామయ్యను దర్శించుకున్న మంత్రి పొంగులేటి దంపతులు



**భద్రాచలం ,మే 8, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి–మాధురి దంపతులు పెళ్లిరోజు సందర్భంగా గురువారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులు స్వామివారి సుప్రభాత సేవకు హాజరైన మంత్రివర్యులకు సుప్రభాత సేవతో పాటు గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి పట్టువస్త్రాలు తీర్థప్రసాదాలు అందించారు. ఐటిసి గెస్ట్ హౌస్ లో పెళ్లి రోజు సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రివర్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు దంపతులు, ఆర్డీవో దామోదర్ రావు, ఈవో రమాదేవి , రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి యుడిఐఎస్ ఈ పోర్టల్ నందు నమోదు అవ్వాల్సిందే

▪ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 8, ప్రజాజ్యోతి:** ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి యుడిఐఎస్ ఈ పోర్టల్ నందు ఖచ్చితంగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం లో బాలికల కంటే బాలురు వెనుకబడి ఉండటానికి గల కారణాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావును

మిగతా 5 లో...



# అడ్డదారులకు... ఆద్యుడు...



- సిరుల మాగానికి అవినీతి మకిలి అంటించిన అరాచక వాది
- సింగరేణి వ్యాప్తంగా పైరవికారుల సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన ఘనుడు
- ఆయన అవినీతిపై పోరాటం చేసి వాళ్లు ఎందరో..
- అయినప్పటికీ ఆగని అక్రమాల దందా
- అవినీతి నిరోధక శాఖ కేసులు.. అరెస్టులు.. రిమాండ్లు..
- అయినా వక్ర బుద్ధి వదలని ప్రబుద్ధుడు
- తప్పను ఎత్తిచూపిన వాళ్లపై దాడులు...
- ఆయన డిక్షనరీలో కాదేదీ అవినీతికి అనర్హం
- ట్రాన్స్ఫర్లు, డిప్యూటేషన్లు, క్వార్టర్ల కేటాయింపు, మెడికల్ బోర్డు దందాల్లో ఆయన ప్రమేయం
- కోల్ బెల్ట్ లో అవినీతి జలగ సంపతుడు
- మొన్నటి వరకు కొనసాగిన ముఠామేస్త్రి అక్రమాల పరంపర
- అనుచరులపై ఏసిబి దాడులతో అజ్ఞాతంలోకి ..
- సంపతుని అక్రమ అందలంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.

**అప్పటివరకు అంగరంగ వైభవంగా వెలుగొందుతున్న సింగరేణి పర్సనల్ డిపార్ట్మెంట్ కీర్తిని అవినీతి కుంపటిగా మార్చేందుకు పూనుకున్నాడు ఓ ప్రబుద్ధుడు. కేవలం సంస్థ ఉనికిని బ్రష్టు పట్టించేందుకు, అవినీతి సొమ్మును పందికొక్కుల మెక్కెందుకు మాత్రమే నేను పుట్టానన్నట్టుగా వ్యవహరిస్తూ.. "అడ్డదారులకు ఆద్యుడు"గా నిలిచాడు సంపతుడు . ప్రతి సాధారణ అంశము, సమస్య, విషయానికి పైరవి ముసుగు తొడ గించవచ్చు అన్న కొత్త ఓరవడికకు వంతెన కట్టాడు. వాస్తవిక అంశాలను వలలో బందీ చేసి.. వసూళ్ల వ్యవస్థను ఉసిగొల్పాడు. శతాబ్ద కాలంగా ఎంతో సస్య శ్యామలంగా ఉన్న సింగరేణి సౌరభ్యాన్ని.. తన స్వవంచన సిద్ధాంతాన్ని ప్రయోగించి సంస్థకు అవినీతి మకిలిని అంటించాడు. సింగరేణిలో అడ్డదారులకు ఆధ్యుడు, అవినీతిపరులకు ముఠామేస్త్రి, అక్రమాల సూత్రధారి సంపతుని అవినీతి సామ్రాజ్యపు తొలి అడుగులు, ఆక్రమ అందలంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.**

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### అక్రమాలకు సెంటినరీతో శ్రీకారం..

సంస్థలో 1987లో క్లర్కుగా ఉద్యోగం చేరాడు. ఆయన ఉద్యోగంలో చేరిన రెండు సంవత్సరాల్లో అంటే 1989 లో కంపెనీ వందేళ్ల ఆవిర్భావ ఉత్సవాన్ని జరుపుకుంది. ఆ సమయంలో నిరుద్యోగులకు తీపి కానుకగా సెంటినరీ నియామకాల పేరిట పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసింది. అప్పటికే ఉద్యోగంలో ఉన్న సంపతుడు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని పలువురిని మోసగించాడు. క్లర్కు ఉద్యోగార్థుల వద్ద చేతివాటం చూపించాడు. అలా అప్పటి నుంచే అవినీతికి పాల్పడం మొదలు పెట్టాడు. ఆ సంఘటనను యాజమాన్యం అప్పుడే సీరియస్గా తీసుకొని ఉంటే ఒక అవినీతి వట వృక్షాన్ని ఆదిలోనే పెకిలించిన వాళ్లు అయ్యే వారు. ఆ పొరపాటు వల్ల గత 35 ఏళ్లలో ఎందరో అమాయక కార్మికులు, మరెందరో నిజాయతీ పరులైన అధికారులు, పేరు మోసిన కార్మిక సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు కూడా ఈ అవినీతి తిమింగం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు.

### బ్లాక్ మెయిలింగ్, చేతివాటం ప్రదర్శన..

1990 తర్వాత కార్పోరేట్ కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్ మెంట్ లో క్లర్కుగా పనిచేస్తూ...అధికారులను బ్లాక్ మెయిలింగ్ చేయడమే కాకుండా శాఖాపరమైన విలువైన, సున్నితమైన సమాచారాన్ని బయట వ్యక్తులకు తెలియజేయడం, వివిధ పత్రాలను ఇతరులకు అందజేయడం లాంటి కార్యకలాపాలు మొదలుపెట్టాడు. ఇది గమనించిన అధికారులు ఈ అవినీతిపరుల ముఠామేస్త్రి ని సెంట్రల్ వర్క్ షాప్ కు బదిలీ చేశారు. సెంట్రల్ వర్క్ షాప్ లో కూడా ఆయన తన చేతి వాటం చూపించాడు. 1997-98లో అక్కడ ఆయన చేసిన మరో అవినీతి బట్ట బయలైంది. సెంట్రల్ వర్కుషాప్ నుంచి పైపులను దొంగతనం చేశాడన్న ఆరోపణలు విజిలెన్స్ విచారణలో నిజమని తేలింది. ఆయన నుంచి డబ్బు ను కూడా రికవరీ చేశారు. అక్కడ పని చేసిన కాలంలో ఒకరిద్దరు ఉద్యో గులపై అకారణంగా దాడులకు కూడా తెగబడ్డాడు. ఈ అడ్డదారుల ఆద్యుడు..

చేసిన తప్పులకు శిక్షగా ఇతర ఏరియాకు బదిలీ కూడా చేశారు. అయితే యూనియన్ పలుకుబడిని ఉపయోగించుకొని కొత్తగూడెంలోనే ఉంటూ తన అవినీతి కార్యకలాపాలను కొనసాగిస్తూ వచ్చాడు. ఇంతటి అవినీతి నేపథ్యం, అరాచక ప్రవర్తన ఉన్న ఆయనను ఎట్టి పరిస్థితుల్లోనూ కార్పోరేట్కు మాత్రం తీసుకోవద్దని అప్పట్లోనే నిర్ణయించి కొత్తగూడెం ఏరియాకు బదిలీ చేశారు.

### అడ్డగోలుగా సంస్థ సొమ్మును దోచుకుంటూ..

2002లో కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న కాలంలోనూ ఆయన అరాచకాలు ఆగలేదు. పెట్రోల్ బంకులో పనిచేస్తున్న సమయంలో ఇద్దరు కార్మికులపై దాడి చేశాడు. పెట్రోల్ పోయడంలో చేతివాటం చూపించడం, దాన్ని సొంతానికి వాడుకోవడం చేశాడు. ఈ ఆక్రమార్కుని పుణ్యమా అంటూ చివరికి ఆ బంకునే పూర్తిగా మూసేశారు. ఇ ప ్పటి వరకు కంపెనీ సొమ్మును దోచుకుంటూ వచ్చిన అక్రమాల సూత్రధారి.. కార్మికుల కష్టాన్ని కూడా దోచుకోవడానికి కొత్తగూడెం సీఈఆర్ క్లబ్ను అడ్డాగా చేసుకున్నాడు. 2008 నుంచి కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్ లో కీలక పదవిలో కొనసాగుతూ యాజమాన్యం చెల్లించే సొమ్ము, కార్మికుల సభ్యత్వ రుసుం, ఫంక్షన్ల కోసం వచ్చే డబ్బును కాజేశాడని బలమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై టీఎన్ టీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి అప్పట్లో పెద్ద పోరాటమే చేశారు. సంపతుడు సీఈఆర్ క్లబ్ లో చేసిన అవినీతిని వెలికితీసేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా చాలా అర్జీలు పెట్టారు. దీనిపై స్పందించాలని 18.02.2012, 22, 03.2012, 20.04.2012లో సింగరేణి యాజమాన్యం ఈ అక్రమార్కునికి లేఖలు రాసింది. అయినా సరే ముఠామేస్త్రి స్పందించలేదు. దీంతో యాజమాన్యం కూడా సమాధానం ఇవ్వలేక పోయింది. ఈ నేపథ్యంలో మరో వ్యక్తి రాష్ట్ర సమాచార కమిషన్ కు దరఖాస్తు చేసుకోవడం ద్వారా సీఈఆర్ క్లబ్ పేరిట ఆయన చేసిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆడిటింగ్ చేపించకుండా క్లబ్ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు బట్టబయలు అయింది. ఆయన అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని హెచ్.ఎం.ఎస్ నేత ఒకరు కేంద్ర విజిలెన్స్ కమిషన్ కు కూడా ఫిర్యాదు చేశారు. అలాగే కొత్తగూడెం హెడ్డాఫీసులోని ఉద్యోగుల సంఘం కూడా ఆయన బ్యాంక్ లావాదేవీలను బహిర్గతం చేసింది. కఠిన చర్యలు తీసుకోవాలని సీఎండీని కోరారు. క్లర్కుగా పనిచేస్తున్న ఆయన బ్యాంక్ ఖాతాలో రెండు కోట్ల రూపాయలు ఉన్నాయని ఆధారాలతో బయట పెట్టారు.

### కేసులు, రిమాండ్లు..

జూన్ 27, 2012న కొత్తగూడెంలో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ముందురోజు రాత్రి మద్యం బాటిల్స్ తో పోలీసులకు పట్టుబడ్డాడు. కార్మికులకు మధ్యపానం వంచనతో ఓట్లు వేయించుకోవాలని అనైతిక చర్యకు పాల్పడ్డాడు. సంపతుడి అక్రమాలను ఎత్తి చూపిన వాళ్లు ఎవరైనా సరే వారిని దాడులతో భయ భ్రాంతులకు గురి చేయడం ఆయన నైజం. నిజాలను నిర్భయంగా రాసే పత్రికా విలేకరుల పైన కూడా ఆ సమయంలో తీవ్రంగా దాడి చేశాడు. దీంతో ఆయన అరాచకాలపై పాత్రికేయులంతా కలసి ఫిర్యాదు చెయ్యగా.. సెప్టెంబరు 21, 2012న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు పంపించారు.

### మస్టర్ల అవకతవకలు..

అవినీతికి పాల్పడంలో మంచి పనితీరును కనబరిచే ఈ అక్రమార్కుడు.. ఉద్యోగం చేయకుండానే తప్పుడు మస్టర్లతో కంపెనీని మోసం చేస్తూ జీతం తీసుకుంటున్నారని కొందరు బహిర్గతం చేశారు. ముఖ్యంగా పెళ్లి రోజున కూడా మస్టర్ పడ్డారని, ఆయన తండ్రి చనిపోయినప్పుడు కూడా డ్యూటీ చేసినట్లుగా రికార్డు అయిందని సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ తరుణంలో ఆయన చేస్తున్న అవినీతి, అక్రమాలను ప్రెస్ మీట్ల ద్వారా ప్రజలకు తెలియజేసిన అప్పటి ఓ సింగరేణి కార్మిక సంఘం నాయకుడిపై తన అనుచరులను దాడికి పంపించి చంపుతానని బెదిరించాడు. దీనిపై తమకు రక్షణ కల్పించాలని అదే రోజున కొత్తగూడెం మొదటి టౌన్ పోలీసు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ కు కొందరు నాయకులు లిఖిత పూర్వక ఫిర్యాదు కూడా చేశారు.

### అన్ని సంఘాలలో లొల్లి పెట్టి..

ఈ అడ్డదారుల ఆద్యుడు పని చేయని యూనియన్ లేదు. ఏ యూనియన్ లో ఉన్నతన వక్రబుద్ధిని, అవినీతి, అక్రమాలను, అరాచకాలను చూసి కొద్ది కాలానికే బహిష్కరించని సంఘాలు అనేకం. క్లర్కుల సంఘంలో మొదట్లో పనిచేసిన ఆయన అవినీతి కంపును వాళ్లు భరించలేక తరిమేశారు. 2013లో ఆయన అక్రమాలను తట్టుకోలేక అప్పటి ఐఎన్ టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యూనియన్ నుంచి బహిష్కరించారు. కొద్ది నెలలు టీబీజీకేఎస్ లో ఉన్న ఆయన తీరును సహించలేక 2014 లో ఆయనను ఆ సంఘం నుంచి గెంటేశారు. అంతకుముందు టీఎన్టీయూసీ, ఏఐటీయూసీల్లో చేరినా ఆయన అవినీతి తీరును ప్రత్యక్షంగా చూసిన వాళ్లంతా బయటకు పంపించేశారు.

### డిస్మిస్ అయినా ఆగని అక్రమాలు..

సింగరేణి మెడికల్ అన్ ఫిట్ కేసుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ సంపతుడిపై లోకాయుక్తకు ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు చేసిన తెలంగాణ దళిత కార్మిక సంఘం నాయకుడిని ఫోన్ కాల్స్ తో బెదిరించాడు. దీంతో నవంబరు 2014న కొత్తగూడెం వన్ టౌన్ స్టేషన్ లో ఈ అవినీతిపరుడిపై 506 ఐపీసీ సెక్షన్ 61 ఏ , ఇండియన్ టెలికం యాక్ట్ ప్రకారం కేసు నమోదైంది. అడ్డగోలుగా అక్రమాలు చేసుకుంటూ సామాన్యు లను వేధిస్తున్న ఆయనను సింగరేణి యాజమాన్యం ఫిబ్రవరి, 2015న బెల్లంపల్లికి ట్రాన్స్ ఫర్ చేసింది. ఈ ప్రబుద్ధుడి వల్ల వల్ల ఇబ్బంది పడ్డ పలువురు ఉద్యోగులు ఆయనకు బెల్లంపల్లి బదిలీ అయిన వెంటనే ఒక కరపత్రాన్ని ముద్రించి ఆనందించారంటే ఎంతగా ఇబ్బంది పెట్టి ఉండాడో ఆలోచించాలి. అయినా సరే అవినీతి కేంద్రమైన కొత్తగూడెం ను వదలకుండా ఉద్యోగం చేయక పోవడంతో క్రమశిక్షణ చర్యలతో సంపతుడిని యాజమాన్యం డిస్మిస్ చేసింది. ఇలా డిస్మిస్ చేసినా సరే అవినీతి పనులను మాత్రం ఆపలేదు. గతంలో చేసిన పాపాలు వెంటాడంతో మెడికల్ బోర్డు అన్ ఫిట్ దందాలో ఆయన ప్రమేయాన్ని నిర్ధారిస్తూ 2019న అవినీతి నిరోధక శాఖ అరెస్టు చేయడం సింగరేణి వ్యాప్తంగా కలకలం సృష్టించింది. దీంతో ఆయన అవినీతి, అక్రమాలు, అరాచకాలను తెలుసుకుని జనం నివ్వెరబోయారు. నరనరానా అవినీతిని వంటబట్టించుకుని.. వ్యవస్థలను భ్రష్టు పట్టించి, పారదర్శకంగా సేవలు అందించే ఉద్యోగులెందరినో ఈ అక్రమార్కుడు సతాయించాడు.

బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడి అధికారులను వేధించడం ఆయన నైజంగా మారింది. దారికి రాకపోతే దాడులకు పాల్పడం ఆయన సహజ లక్షణంగా అలవోర్చుకున్నాడు. 136 ఏళ్ల చరిత్ర కలిగిన కంపెనీకి అవినీతి మకిలి అంటించిన అతిపెద్ద అరాచకవాది ఈ సంపతుడు. రెండు రోజుల క్రితం తన అనుచరుడు పై ఏసీబి దాడి జరగడంతో అడ్డదారుల అడ్డదారుల ఆద్యుడు అజ్ఞాతంలోకి వెళ్ళినట్టు తెలుస్తోంది.

# ఇల్లందు ఏరియాలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్

**ఇల్లందు, మే 8, ప్రజాజ్యోతి:** సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు గురువారం ఇల్లందు ఏరియాలోని కోయగూడెం, జెకె–5, ఓసిలలో పర్యటించారు. పని స్థలాలను సందర్శించి, అక్కడ జరుగుచున్న పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జిఎం వీసం. కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధిగమించాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఏలాంటి ఆటంకాలు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ఉపరితల గనుల్లో ఎండ తీవ్రత అధికంగా





ఉన్నందున ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని, సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జిఎం వీసం. కృష్ణయ్య, కెఓసి పిఓ గోవిందరావు, జెకె ఓసి పిఓ ఎ. కృష్ణ మోహన్ రావు, డిజియం సివిల్ రవికుమార్, మేనేజర్ పూర్ణచందర్, పి. శ్రీనివాస్, పిఇ శివశంకర్, క్యాలిటీ మేనేజర్ కె. రామదాస్, సర్వే అధికారి నాగేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, సీనియర్ పిఓ వి. అజయ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాలకై ముఖాముఖీ



**ఇల్లందు, మే 8, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జియం వీసం. కృష్ణయ్య ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కొరకు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు గురువారం జిఎం కార్యాలయంలో ముఖాముఖీ (ఇంటర్వ్యూ) నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్పి ఇంజనీర్ క్రిస్టఫర్ మాట్లాడుతూ ఇల్లందు ఏరియా వర్క్ షాప్ నుండి కారుణ్య నియామకాల కొరకు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసురాలికి వారి కుటుంబ సభ్యులు, సాక్షుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అన్ని వివరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇంటర్వ్యూలు పూర్తి అయిన తరువాత వైద్యపరీక్షల కొరకు పంపించిన అనంతరం నియామక ఉత్తర్వులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వర్క్ షాప్ డిజియం నాగరాజు నాయక్, ఏరియా డిజియం (పర్సనల్) జివి. మోహన్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి కె. సాయి స్వరూప్, క్లర్క్స్ శ్రీనివాస్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తీర్చడంలో ఎమ్మెల్యే విఫలం

- బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్



**కొత్తగూడెం, మే 8, ప్రజాజ్యోతి :** వేసవికాలంలో కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 36 వార్డులలో త్రాగునీరు రాక వారం రోజులు గడుస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది గానీ అధికార పార్టీకి చెందిన నాయకులు గానీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని బిజెపి పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ విమర్శించారు. కొత్తగూడెం పట్టణ పరిధిలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పటం హాస్యస్పదంగా ఉందని ఆరోపించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణంలో కిన్నెరసాని నీటి సదుపాయం ఉన్న మరమ్మత్తుల పేరిట డబ్బులు డ్రా చేసే ఏటీఎంలో ఉపయోగపడుతుంది కానీ ప్రజల నీటి అవసరాలను తీర్చడంలో పూర్తిగా పాలక పక్షం విఫలం అయిందని అన్నారు. అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరం కొత్తగూడెం లో సింగరేణి మంచినీటి సౌకర్యం, మినీ వాటర్ స్కీం బోర్లు ఉన్నా కానీ భద్రాద్రి జిల్లా హెడ్ క్వార్టర్ లో కాబోయే కార్పొరేషన్ లో ఇటువంటి సమస్యలు ఉన్న అధికారులు పట్టించుకోకపోవడం ఇక్కడి ఎమ్మెల్యే అసమర్థత కాదా. కేంద్ర ప్రభుత్వం అమృత 2.0 పథకం కింద 120 కోట్లు భద్రాద్రి జిల్లాకు ఇచ్చిన ఎక్కడి పనులు అక్కడే ఉన్నవి వీటిని త్వరితగతిన ప్రజలకు అందించే అవసరం అధికారులకు పాలక పక్ష నాయకులకు లేదా అని కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తిమ్మిరి నరేంద్రబాబు, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఇరెల్లి నాగేశ్వరరావు, గుంపుల మహేష్, బానోత్ రాంబాబు నాయక్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## మైనారిటీ దరఖాస్తుదారులకు ముఖాముఖీలు



**ఇల్లందు, మే 8, ప్రజాజ్యోతి:** రాజీవ్ యువ వికాసంలో భాగంగా మైనారిటీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం మెప్మా కార్యాల యంలో బ్యాంకర్లు, అధికారుల సమక్షంలో ముఖాముఖీలు నిర్వహించారు. కమీషనర్ సిహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో 350 మంది మైనారిటీలు దరఖాస్తు చేసు కోగా 301 మంది హాజరైనట్లు తెలిపారు. ఆయా బ్యాంకర్లు దరఖాస్తు దారుల ఆధార్ కార్డు, పాన్ కార్డులను పరిశీలించడం జరిగిందన్నారు. మేనేజర్ అంకు షావలి, ఏఓ శ్రీనివాస్ రెడ్డి, బ్యాంక్ అధికారులు, మెప్మా, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రవాదులపై మెరుపు దాడి చేసిన భారత సైన్యానికి రెడ్ సెల్యూట్

- సిపిఐ చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి




**చుంచుపల్లి, మే 8, ప్రజాజ్యోతి :** పహల్గాంలో ఇటీవల విచక్షణ రహితంగా ఉగ్రవాదులు దాడి చేసి వందలాది మంది అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని, అందుకు ప్రతి కార చర్యగా భారతదేశ సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాదులపై మెరుపు దాడి చేసి మట్టు పెట్టడాన్ని యావత్ భారతదేశం ప్రాణాలను తెగించి, ఉగ్రవాదులను హతమార్చిన భారత సైన్యానికి రెడ్ సెల్యూట్ చేస్తున్నామని చుంచుపల్లి సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి తెలిపారు. గురువారం చుంచుపల్లి మండలంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యావత్ భారత దేశంలో అన్ని పార్టీలు ఐక్యతతో మద్దతు ఇవ్వడంతో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూరం సక్సెస్ అయిందని, పాక్ ఉగ్రవాదంపై భారత సైన్యం ఒక ప్రణాళిక బద్ధంగా వ్యవహరించి ఉగ్రవాదులను మట్టు పెట్టడం ప్రతి భారతీయుడు గర్వించవలసిన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దుర్గారాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ పాలమూరు శ్రీను, నాయకులు రాంజీ, భాగం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 8, ప్రజా జ్యోతి :** ఒప్పంద ఉద్యోగాలకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లా డుతూ ప్రపంచ బ్యాంకు సహకారంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంప్ పథకానికి ఒప్పంద పద్ధతిలో మేనేజర్, సహాయ మేనేజరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్య ర్థులు ఈ నెల 10వ తేదీలోపు www. nimsme. gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఐ డి ఓ సి కార్యాలయంలో పరిశ్రమలశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## ఆపరేషన్ సింధూర్ పై హర్షం వ్యక్తం చేసిన కేసుపాక సందీప్



**భద్రాచలం , మే 8, ప్రజాజ్యోతి :** పర్యాటకులపై ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన ఆపరేషన్ సింధూర్ పై కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు కేసుపాక సందీప్ హర్షం వ్యక్తం చేశారు. పాక్ లోని ఉగ్ర స్థావరాలను భూస్థాపితం చేసిన చర్యను భారత సైన్యాన్ని అభినందించాలని అన్నారు . పాకిస్తాన్ ధోరణి ఇప్పటికైనా మారాలని లేని పక్షంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సందీప్ అన్నారు .

## జిల్లాలో నేటి వరకు 145 దాన్యం కొనుగోలు కేంద్రాల నుండి 23 400, 080 టన్నుల ధాన్యం కొనుగోలు

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 8, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2024 _ 25 సంవత్సరానికి గాను యాసంగిలో మొత్తం 145 దాన్యం కొనుగోలు కేంద్రాల నుండి 23400, 080 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చేసే వేణుగోపాలరావు తెలిపారు, వీటిలో పిఏసిఎస్ నుండి 100 సెంటర్లను, జిసిసి నుండి 24 సెంటర్లను, డీసీఎం, ఎస్ 13, డి ఆర్ డి ఏ నుండి 08 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇప్పటివరకు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి 33400, 080 తన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జెసి తెలిపారు, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉండాల్సిన కనీస మౌలిక సదుపాయాలు టార్పోలిన్లు, ప్యాడి క్లీనర్స్, గోని బస్తాలు, ఎలక్ట్రానిక్ తూనికల పరికరాలు, షెడ్లు, తాగునీరు, రిజిస్టర్లు, రికార్డులు, మరికొన్ని సదుపాయాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందన్నారు, వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ఉరుములు మెరుపులు వచ్చేముందు ఎ సి సి యు వాటర్ యాప్ను అప్లికేషన్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులు ఇన్స్టాల్ చేసుకుని వర్షం ఉరుములతో కూడిన హెచ్చరికలను గంట గంటకి తెలుసుకుంటూ వారి యొక్క పరిధిలో గల రైతులకు కూడా ఈ అప్లికేషన్ ని ఇన్స్టాల్ చేసుకునే విధంగా అప్లికేషన్ గురించి మార్గ నిర్దేశాలు చేయడం జరిగిందన్నారు, తరచుగా వస్తున్న అకాల వర్షాలకి 145 సెంటర్లలో ఎక్కడా కూడా ధాన్యం తడవకుండా జాగ్రత్త పడుతూ ఇప్పటివరకు పైన తెలిపిన టన్నుల ధాన్యాన్ని 3273 మంది రైతుల వద్ద నుండి 54 కోట్ల 15 లక్షల విలువగల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు, రైతులు దళారుల ప్రలోభాలకు గురి కాకుండా ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు దాన్యమును విక్రయించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు దాన్యం రైతులు వచ్చేటప్పుడు నిర్ణీత తేమశాతం 17 శాతం ఉండేవిధంగా, ఎఫ్ ఏ ఓ పరిణామాల పరిధిలో ఉండే విధంగా ధాన్యమును ధాన్యము కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఈ సందర్భంగా జెసి కోరారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి



**ఇల్లందు, మే 8, ప్రజాజ్యోతి:** పట్టణంలోని ఇల్లందులపాడు చెరువులో పడి ప్రమాదవశాత్తు సింగరేణి విశ్రాంత ఉద్యోగి ధరావత్ హచ్యనాయక్ (72) గురువారం మృతి చెందాడు. 22వ వార్డుకు చెందిన హచ్యనాయక్, మరో వ్యక్తితో కలిసి ఇల్లందుల పాడు చెరువులోకి వెళ్లి చిక్కుకున్నట్టు తెలిసింది. మృతదేహన్ని బయటకు తీసి పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**పాల్వంచ,(రూరల్ ), మే 08,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పాల్వంచ మండలం,కేశవాపురం జగన్నాథపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర సమాచార,రెవెన్యూ, హౌజింగ్ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబసమేతంగా శ్రీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవస్థాన సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.రజనీకుమారి,పాలకమండలి వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.వీరికి పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు,అమ్మవారి శేషవస్త్ర ప్రసాదంను అందించారు.వీరి వెంట పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు,జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ సుకృత అమ్మవారిని దర్శించుకొని పూజలో పాల్గొన్నారు.పై కార్యక్రమములు దేవస్థానంలో నిర్వహించబడినవని దేవస్థాన కార్యనిర్వహణాధికారి,పాలకమండలి వారు ఒక ప్రకటనలో తెలియచేశారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోండి

- సీనియర్ బాస్కెట్ బాల్ కోచ్ జాన్సన్ డేవిడ్(బాబు)



**కొత్తగూడెం, మే 08, ప్రజాజ్యోతి :** సింగరేణి కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో సింగరేణి ప్రభావిత ప్రాంత పిల్లలు, సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, పరిసర ప్రాంత 18 సంవత్సరాల లోపు బాల బాలికలకు సిఈఆర్ క్లబ్ ప్రాంగణంలో నీ బాస్కెట్ బాల్ కోర్టులో ఉచిత బాస్కెట్ బాల్ విభాగంలో మే 20 వరకు జరిగే ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించుచున్నారు. దీనిలో భాగంగా ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ బాస్కెట్ బాల్ కోచ్ లు జాన్సన్ డేవిడ్(బాబు) జబ్బర్ లు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపుకు తనను, జబ్బర్ ను కోచ్ లు గా బాధ్యతలు ఇచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ద్వారా బాల బాలికలు ఎంతో విలువైన ఈ వేసవి సెలవులను వృధా చేయకుండా, మానసిక ఉల్లాసానికి, ఉపయోగపడే ఈ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వేసవి శిక్షణా శిబిరం అనుభవజ్ఞులైన కోచ్ ల ద్వారా ప్రతి రోజు ఉదయం 6.00 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 గంటల 7.00 గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీరం దృఢంగా తయారవుతుందన్నారు. బాస్కెట్ బాల్ సమ్మర్ క్యాంప్ కు ప్రస్తుతం 80మంది బాలబాలికలు హాజరవుతున్నారని, ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భద్రాద్రి జిల్లా సమస్యలపై కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు



**కొత్తగూడెం, మే 08, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పేరుకుపోయిన అనేక సమస్యల మీద బీజేపీ పార్టీ ఐదు నియోజకవర్గ నేతలు కలసి గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లో ఈ జిల్లా లో కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల లిస్ట్ లో చేర్చిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు నిజమైన అర్హులకు మొండి చేయి చూపారు. ఇప్పడికైనా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ళ కమిటీలు ఎంపిక చేసే లబ్ధిదారుల లిస్ట్ పై పూర్తి దర్యాప్తు చేసి నిజమైన పేదలకే ఇల్లులు మంజూరు చెయ్యాలని అన్నారు . ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కూడ ప్రజల సమక్షం లోనే జరగాలని అన్నారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో సుమారు రెండు లక్షల ఇరవై వేల మంది రైతులు ఉంటే కేవలం యాభై వేల మంది రైతులకే రుణ మాఫీ అయినది అని ఇంకా మిగిలిన లక్ష ఎనభై వెల మంది రైతులకు తక్షణమే రుణ మాఫీ చెయ్యాలన్నారు. రైతు భీమా, రైతు భరోసా , వ్యవసాయ భూముల పట్టా పహాణి ల సమస్య లు కూడ పరిష్కరించాలని అన్నారు. జిల్లా లోని అన్ని గ్రామ పంచాయితీ లో సర్పంచ్ లు లేని కారణంగా పాలన పూర్తిగా స్తంభించి పోయినది దాని కారణంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులు, మంచినీటి సమస్య ఇలా అనేక సమస్య లు ఉన్నాయని వీటన్నిటి మీద ప్రేత్యేక దృష్టి సారించాలని అన్నారు. రాజీవ్ యువ వికాస పథకం లో సిబిల్ స్కోర్ తో సంబంధం లేకుండా చదువుకున్న ప్రతి నిరుద్యోగికి రుణం మంజూరు చెయ్యాలని అన్నారు. జిల్లా లో ఉన్న సీతారామ ప్రాజెక్టు నిర్మాణం లో జరిగిన అవక తవకల పై విచారణ జరిపించాలని, మిగిలిన పనులు వెంటనే చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలని అన్నారు, ఈ మధ్యకాలం లో కురిసిన అకాల వర్షం కారణంగా నష్టపోయిన మామిడి రైతులకు, వరి రైతులకు నష్టంపై అంచన వేసి తక్షణమే నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని తెలిపారు. జిల్లా లో ఉన్న పామాయిల్ రైతులకు పహాణి ద్వారా డ్రిప్ సబ్సిడీ ఇవ్వాలని అన్నారు . ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా మాజీ కన్వీనర్ నాళ్ల సోమసుందర్, ముస్కు శ్రీనివాస రెడ్డి,(మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్), పోడియం బాలరాజు (పినపాక కాంటెస్టెడ్ MLA అభ్యర్థి ), తాటిపాముల ఐలయ్య (జిల్లా ప్రధాన కార్యదర్శి) గొట్టెపొల్ల శ్రీనివాస్ (అశ్వారావు పేట నియోజకవర్గ కన్వీనర్), బుడగం రవి (ఖమ్మం పార్లమెంట్ కో కన్వీనర్), యెడ్లపల్లి శ్రీనివాస కుమార్ (మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి), భూక్యా సీతారాం నాయక్ (మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పొనిశెట్టి వెంకటేశ్వర్లు (బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి), D రమేష్ బాబు (దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు), దున్నపోతుల రాజు (జిల్లా కౌన్సిల్ మెంబర్), దాసరి రమేష్, మాదారపు లక్ష్మణ్, B వీరన్న , గుండు రాజు , సురేందర్ లు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహణ

- పంచాయతీ కార్యదర్శులు చిత్తశుద్ధితో శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి





**కొత్తగూడెం కలెక్టరేట్ మే 8, ప్రజా జ్యోతి:** భారత ప్రభుత్వం పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ సహకారంతో, డాక్టర్ మర్రి జనారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమాచార హక్కు ,గ్రామ సభ కోసం సామర్ధ్య నిర్మాణ కేంద్రం( సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ భాగస్వామ్యంతో ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఖమ్మం ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది , ఈ శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 ప్రకారం గ్రామ సభ యొక్క పాత్ర, మెరుగైన స్థానిక పాలన కోసం ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలనను ప్రోత్సహించడం, సమాచార హక్కు చట్టం , స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించడం ద్వారా పారదర్శకతను ప్రోత్సహించడం, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక బృందాలు, పౌర సమాజ సంస్థలతో సమన్వయంతో గ్రామ సభలను బలోపేతం చేయడం, మహిళా–స్నేహపూర్వక గ్రామ పంచాయతీలను ప్రోత్సహించడం, మహిళా సాధికారత ,బాలల సంరక్షణకు సంబంధించిన ముఖ్యమైన చట్టాలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు, ఇందులో భాగంగామొదటి రోజు కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్థాయిలో పారదర్శకతను ప్రోత్సహించడం, సమాచార హక్కు చట్టం–2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, గ్రామ సభ సమాచార హక్కు వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. అలాగే, ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలన యొక్క ప్రాముఖ్యత, మహిళా గ్రామ సభలు, గ్రామ సభ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి పాత్ర, వివిధ శాఖలు, స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాలపై చర్చించారు. అనంతరం మహిళా గ్రామ సభల ద్వారా మహిళా , శిశు–స్నేహపూర్వక గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఈ కార్యక్రమం నకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రమౌళి జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు అందరూ చిత్తశుద్ధితో శిక్షణ కార్యక్రమం పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రూ. 2.75 లక్షల గంజాయి పట్టివేత

- 5.5 కేజీల గంజాయి 6 సెల్ ఫోన్లు మూడు మోటార్ సైకిళ్లు
- ఏడుగురు వ్యక్తులను రిమాండ్ కు తరలించిన పోలీసులు





**అశ్వారావుపేట, మే 08, ప్రజాజ్యోతి :** నిషేధిత గంజాయితో పలువురు వ్యక్తులను అశ్వారావుపేట పోలీసులు పట్టుకున్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో సీఐ నాగరాజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తూ పట్టణంలోని భద్రాచలం రోడ్ హెచ్ పి పెట్రోల్ బంక్ వద్ద ఎస్సై యయాతి రాజు వాహనతనిఖీ చేస్తుండగా ఊట్లపల్లి వైపు నుండి అశ్వారావుపేట వైపుకు మూడు బైకులు పై ఏడుగురు వ్యక్తులు వస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా వారివద్ద గంజాయి ఉన్నట్లుగా నిర్ధారించారు. వారిని విచారించగా అశ్వారావుపేట పట్టణానికి చెందిన షేక్ ఫిరోజ్ ఖాన్, గండికోట ప్రభుకుమార్, పసుపులేటి గోపీచంద్ కాగా ఏపీలోని జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన పుట్ట జగదీష్, గుంటూరు జిల్లా శ్యామలపురం మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆవుల సుధీర్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన తిరువీధుల కార్తీక్, హైదరాబాద్ కు చెందిన బుల్లా సంజయ్ ఏడుగురు వ్యక్తుల నుండి రూ.2.75 లక్షల విలువ గల 5.5 కేజీల గంజాయి 6 సెల్ ఫోన్లు మూడు మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపుతున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామ్మూర్తి, హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రరావు, పిసీలు హరిబాబు, కృష్ణ ప్రసాద్, రమేష్ రావు, రామకృష్ణ, నరేష్ బాబు, భానుచందర్, వెంకటేశ్వరరావు, సంతోష్ లు పాల్గొన్నారు.

# కమ్మిల హరి సత్యశ్రీని సన్మానించిన పొదెం



**భద్రాచలం టౌన్, మే 8 (ప్రజాజ్యోతి):** భద్రాచలం పట్టణానికి చెందిన కమ్మిల రామ్ మోహన్ రావు కుమార్తె కమ్మిల హరి సత్యశ్రీ రాష్ట్రస్థాయి లో తమ ప్రతిభతో కాంతులు చిందించారు. ఆర్ ఆర్ కే వాహిని జూనియర్ కాలేజీ లో జూనియర్ ఇంటర్ చదువుతున్న హరి సత్యశ్రీ, ఇటీవల విడుదలైన ఫలితాలలో రాష్ట్రం మొత్తంలో రెండవ స్థానాన్ని సాధించి 470లో 467 మార్కులు పొందడం గర్వకారణమైన విషయం.ఈ సందర్భంగా ఆమెను ఆమె తల్లిదండ్రుల సమక్షంలో గురు వారం సాయంత్రం భద్రాచలం లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు..ఈ సన్మాన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముఖ్య అతిథిగా హాజరై, సత్యశ్రీకి శాలువాతో సత్కరించి, ఘనంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, విద్యావేత్తలు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు. విద్యార్థులందరూ హరి సత్యశ్రీను ఆదర్శంగా తీసుకొని తమ లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

# నిరుపేదలందరికి... సన్నబియ్యం అందించడమే మా లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)

సన్నబియ్యం లబ్ధిదారుడు అయిన పిట్టల లక్ష్మీకాంతం, బాబురావు కుటుంబ సభ్యులతో కలిసి సన్నబియ్యంతో తయారుచేసిన వంటకాలతో భోజనం చేసారు . తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు తమ గృహానికి భోజనం చేయడానికి రాగానే కుటుంబంలోని సభ్యుల ఆనందానికి అవధులు లేవు. మంత్రివర్యులు వారు మనస్ఫూర్తిగా సన్నబియ్యంతో వండిన ఆహారం , రుచికరమైన కూరలు తయారుచేసి వడ్డించిన ఆహారాన్ని తృప్తిగా భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం దేశానికే ఆదర్శమని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను



ప్రవేశపెట్టి పేద ప్రజలకు మహిళలకు అన్ని వర్గాల ప్రజలకు చేదోడు గా ఉంటుందని అన్నారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చేందుకు ఈ సన్నబియ్యం పథకం ఎంతో ఉపయోగపడుతుందని, మహిళా ఆర్థిక అభివృద్ధి కోసం ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ కంపెనీ పథకం, వడ్డీ లేని రుణాల ద్వారా మహిళలు వివిధ నూతన వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు చాలా పేదరికంతో కాలం గడుపుతున్నామని, ఉండడానికి సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నామని, మంత్రి దృష్టికి తీసుకురాగా ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేకు సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఆర్డీవో దామోదర్ రావు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజల కలకలం

- 2వ వార్డులో క్షుద్ర పూజలు
- వార్డులోని మూడు రహదారుల మధ్యలో పూజలు
- భయాందోళనలో వార్డు ప్రజలు
- అధైర్యపడవద్దని సీఐ సూచన



**ఇల్లెందు, మే 8, ప్రజాజ్యోతి:** పట్టణంలోని 2వ వార్డులో గురువారం ఉదయం క్షుద్ర పూజలు కలకలం రేపాయి. 2 వ వార్డు ఇల్లందులపాడు లోని గాంధీ విగ్రహం వద్ద మూడు రహదారులు కలిసే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. వార్డు నుంచి నిత్యం పట్టణంలోకి వచ్చేందుకు ప్రధాన మార్గమైన కూడలిలో ఈ పూజలు నిర్వహించడం పట్ల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పూజలు నిర్వహించింది ఎవరు అంటూ ఆరా తీసే పనిలో వార్డు ప్రజలు నిమగ్నమయ్యారు. ఎవరిని టార్గెట్ చేసుకొని ఈ పూజలు నిర్వహించారంటూ బస్తీ వాసుల్లో చర్చనీయాంశమైంది. కాగా ఈ క్షుద్ర పూజలు జరిగిన విషయం తెలిసిన వెంటనే ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణ ఘటన స్థలానికి వెళ్లి ప్రజలెవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.

## కక్షిదారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసిన జడ్జి



**ఇల్లందు, మే 8, ప్రజాజ్యోతి :** ఇల్లందు కోర్టు ఆవరణలో గురువారం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కక్షి దారుల కొరకు ఏర్పాటు చేసిన మజ్జిగ ప్యాకెట్లను ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ కక్షిదారుల కోసం ఇల్లందు బార్ అసోసియేషన్ ఇలాంటి సేవా కార్యక్రమాలు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కక్షిదారుల కోసం గత నెల చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడం ద్వారా కోర్టుకు వచ్చే వయోవృద్ధులు, పిల్లలు అలసటకు గురికాకుండా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఉమామహేశ్వరరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

- వందలాది ప్రజలు ఎం.పీ.డీ.వో. కార్యాలయం ముట్టడి



**పాల్వంచ(రూరల్ ),మే 08,ప్రజా జ్యోతి :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో రాజకీయ జోక్యాన్ని నివారించాలని,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని,పెండింగ్ లో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని,స్థానిక సమస్యలను పరిష్కరించాలని బండ్రిగుండలో జరిగిన ఉపాధి హామీ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టి డబ్బులు రికవరీ చేయాలని మండలంలో ఉన్న వలస ఆదివాసీలకు పోడు భూములకు పట్టా లుఇవ్వాలని ఆదివాసీలకు కుల దృవీకరణ పత్రాలు ఇవ్వాలనికోరుతూ నేడు పాల్వంచ రూరల్ మండలంలో వందలాది మంది పేదలు ఎం.పీ.డీ.వో కార్యాలయం ముట్టడించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు,అన్నవరపు కనకయ్య,పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన వెంకటేశ్వర్లు,పార్టీ మండల కార్యదర్శి పాకాల వెంకట్రావు, మండల కమిటీ సభ్యులు సర్ప నరేందర్,పాయం నరసింహారావు, భూక్యా లాలు,కంట శ్రీను,కంటే రాందాస్,,పద్దం భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి యుడిఐఎస్ ఈ పోర్టల్ నందు నమోదు అవ్వాల్సిందే...

(మొదటి పేజీ తరువాయి...)

అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లో కూడా డిజిటల్ ఎడ్యుకేషన్ , ఫేషియల్ అటెండెన్స్ ప్రవేశ పెట్టేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలలో అతిపెద్ద మైదానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతల నిర్మాణం జరగడం లేదని, వెంటనే అన్ని కళాశాలల్లో ఎకరాకి ఐదు ఇంకుడు గుంతలు లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ కళాశాలలో పరీక్షకు హాజరైన సంఖ్యకు, యుడిఐఎస్ ఈ నందు నమోదుకు చాలా తేడాలు ఉన్నాయని, ఆ కళాశాల ప్రిన్సిపాల్ లను పిలిపించి జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అందరూ ఇక్కడే విద్యార్థులందరినీ యుడైస్ ప్లస్ పోర్టల్ లో నమోదు చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర చారి , కోఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలి

- మాజీ ఎంపిపి మండల రాము



**ఇల్లందు, మే 8, ప్రజాజ్యోతి :** మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మంజూరు చేసిన సిఆర్ఆర్ ఫండ్ రూ. 30 లక్షలతో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులను గురువారం మాజీ ఎంపిపి మండల రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాయం లలిత, ఉప సర్పంచ్ ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, డి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.